క్లుప్తంగా

బాల్య వివాహాలు అరికట్టాలి

పొన్నూరు: మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఏకా పవన్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణం లోని 31వ వార్డులోని తెలగాయపాలెంలో బాల్య వివాహాలను అరికట్టడం, ప్రారంభ గర్భధారణ వాటి వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది మగ్బుల్ బేగ్, పారాలీగల్ వలంటీర్ తాజ్ మహమూద్ బేగ్ పాల్గొని బాల్య వివాహాలు, గర్భధారణ ప్రారంభదశ పర్యవసానాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

యానాదుల సంక్షేమానికి కృషి



పొన్నూరు: యానాది వర్గీయుల సంక్షేమమే లక్ష్యంగా యానాదుల (గిరిజన) యూత్ ఫెడరేషన్ పనిచేస్తుందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎందేటి వెంకట సుబ్బయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో ఫెడరేషన్ రాష్ట్రకార్యవర్గం సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, విధివిధానాల గురించి చర్చించారు. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని యానాదులందరికీ ఆధార్, రేషన్, జాబ్ కార్డులు ఉండేలా చేసి సంక్షేమ పథకాలకు యానాదులను చేరువ చేయటమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులకు సూచించారు. యానాదుల అభివృద్ధి, ప్రధాన వృత్తి చేపల వేటలో సొసైటీల ఏర్పాటుపై, గ్రామ స్థాయి నుంచి అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమరగిరి వెంకటప్రసాద్, కొమరగిరి సూరిబాబు, నాయకులు చౌటూరు రమేష్, ఏకుల నిరంజన్, రాపూరి గోపి, కొమరగిరి మరియమ్మ, కాకుమాను మండల నాయకులు శివయ్య, యలమందయ్య, కొండలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి బెడ్ అందజేత



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌కు యంగ్ జనరేషన్ టీం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆదివారం క్లినికల్ బెడ్‌ను అందజేశారు. వడ్లమూడిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు గతంలో యంగ్ జనరేషన్ టీం ఆధ్వర్యంలో ఫ్యాన్‌లు, కుర్చీలు, బెడ్‌లను అందించటం జరిగింది. టీం ఫౌండర్ షేక్ సాదిక్ ఆధ్వర్యంలో బెడ్‌ను అందజేశారు. నవీన్ సాయి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



గుంటూరు మెడికల్: వైద్య విద్యార్థులు తాము ఉంటున్న హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి అన్నారు. ఆదివారం స్థానిక అమరావతి రోడ్డులోని గుంటూరు మెడికల్ కాలేజ్ బాయ్స్ హాస్టల్‌ను ప్రిన్సిపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి గదికి చెత్త బుట్టలు పంపిణీ చేశారు. 'స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర' లక్ష్యంతో డస్ట్ బిన్‌లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ వైద్య విద్యార్థులతో మాట్లాడి వారి అవసరాలను తెలుసుకుని తగిన చర్యలు త్వరలో తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినాయక చవితి ఉత్సవాలను అందరూ కలసి శాంతియుతంగా జరుపుకోవాలని, ఇతరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చెవి, ముక్కు, గొంతు సమస్యలపై అవగాహన

లక్ష్మీపురం: చెవి, ముక్కు, గొంతు సమస్యలపై అవగాహన అవసరమని సీనియర్ పల్మనాలజిస్ట్ సర్జన్ వి.వి.కె.సందీప్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పెద్దలలో ముక్కు దూలం వంకరగా ఉండటం, సైనసైటిస్ లాంటి సమస్యలు వస్తున్నాయని, ముక్కు దూలం వంకరగా ఉంటే శ్వాస సరిగా వెళ్లక ఇబ్బందికి గురి అవుతారని దీనికి మంచి శస్త్ర చికిత్స అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం డాక్టర్ సందీప్‌ను అవగాహన సభ్యులు ఘనంగా సత్కరించారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. వేమన ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకులు కళ్యాణం చంద్రశేఖరరావు పాల్గొని ప్రసంగించారు.

● పగుళ్ల రోడ్లతో ప్రమాదాలు



ఇందిరానగర్‌లో పగుళ్లిచ్చిన రహదారి

పొన్నూరులోని పలు వార్డులలో పగుళ్లిచ్చి అధ్వానంగా ఉన్న రహదారులతో జనాలు అవస్థలు పడుతున్నారు. నాసిరకంగా రహదారుల నిర్మాణాలు చేపట్టడంతో పలువురు ప్రమాదాలపాలవుతున్నారు. ఏళ్ల తరబడి పగుళ్లిచ్చిన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా రాత్రిళ్లు వాహనాలు అదుపు తప్పడంతో చోదకులు పడిపోతున్నారు. పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. – పొన్నూరు

● కంపచెట్లతో తిప్పలు



నండూరుకు వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చి చెట్లు

మండలంలోని నండూరు పంచాయతీకి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న కంప మొక్కల కారణంగా వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గత కొన్నాళ్లుగా పిచ్చిమొక్కలతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రిళ్లు విష పురుగుల సంచారం కారణంగా బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగించాల్సి వస్తోందని అంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తుప్పలు మరింత పెరిగాయని సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. – పొన్నూరు

మద్యం సేవించి స్పిన్నింగ్ మిల్లు కార్మికుడు మృతి



చేబ్రోలు: అతిగా మద్యం సేవించిన స్పిన్నింగ్ మిల్లు కార్మికుడు మృతి చెందిన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా ఫాసి గ్రామానికి చెందిన మిధున్ మండల్ (30) గత రెండు సంవత్సరాలుగా కేకే స్పింటెక్స్‌లో స్పిన్నింగ్ మిల్లు లో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. మిధున్ మండల్, అతని భార్య సంధ్యారాణి మండల్‌తో కలిసి మిల్లులో పనిచేస్తూ క్వార్టర్‌లో నివసిస్తున్నారు. వీరికి పిల్లలు లేరు. మిధున్ మండల్ మద్యానికి బానిసవటంతో జీతం వచ్చిన తరువాత ఆహారం తీసుకోకుండా నిరంతరం మద్యం సేవించి మిల్లు ఆవరణలో తిరుగుతూ ప్రధాన గేటు వద్ద పడిపోయాడు. సెక్యూరిటీ గార్డు గుర్తించి పరిశీలించగా మృతి చెందినట్టు గుర్తించారు. అతిగా మద్యం తాగటం ఆహారం తీసుకోకపోవటంతో గొంతు ఎండిపోయి మరణించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతుని భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కుబడి 'పీజీఆర్ఎస్'!

- ● ప్రతివారం ఏడు దాటని అర్జీలు
- ● ఆన్‌లైన్‌కు నోచుకోని సమస్యాత్మక అర్జీలు
- ● నాన్చుడు ధోరణిలో రెవెన్యూ అధికారులు
- ● గుంటూరు కలెక్టర్ పీజీఆర్ఎస్‌కు తరలుతున్న స్థానిక ఫిర్యాదుదారులు



పొన్నూరు తహసీల్దార్ కార్యాలయం

పొన్నూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రతివారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోందనే విమర్శలు వస్తున్నాయి. వారం వారం వచ్చి అర్జీలు ఇచ్చినా ఫలితం శూన్యమనే అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. అర్జీలు అధిక సంఖ్యలో వస్తున్నా వాటిలో కొన్నింటినే పరిగణనలోకి తీసుకోవడంతో ఇక్కడ ఇస్తే పరిష్కారం కావడం లేదనే ఉద్దేశంతో అర్జీదారులు గుంటూరుకు వెళుతున్నారు.

నిర్లక్ష్య ధోరణి..

ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొంటున్నారు. మండలంలోని 29 గ్రామాలతో పాటు పట్టణంలోని 31 వార్డులకు సంబంధించిన ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు పెట్టుకుంటున్నారు. అయితే సుమారు 3 నుంచి 4 గంటల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో గత నాలుగు వారాలుగా ఏడు అర్జీలు దాటకపోవడం విశేషం. వాటిలో రెవెన్యూతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలు ఉండటం గమనార్హం. సమస్యాత్మకమైన అర్జీలను పరిగణనలోకి తీసుకోవడంలేదని విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. తీసుకున్న అర్జీలకు ఫోన్‌ద్వారా సమాచారం ఇస్తామని చెబుతూ అర్జీదారులను మభ్యపెడుతున్నారని పలువురు చెబుతున్నారు. దీంతో గుంటూరులో జరిగే కలెక్టర్ పీజీఆర్ఎస్‌కు స్థానిక ప్రజలు తరలివెళుతున్నారు.

పూర్తిస్థాయిలో నమోదు అనుమానమే..!

భూ సమస్యలు, కొత్త రేషన్ కార్డులు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, కుల, ఆదాయ సర్టిఫికెట్ వంటి పలు సమస్యలతో అర్జీలు అందజేస్తున్నారు. అయితే స్వీకరిస్తున్న అర్జీలు పూర్తిస్థాయిలో నమోదు కావడంలేదని తెలుస్తుంది. అరకొరగా నమోదు చేస్తూ సమస్యాత్మకమైన అర్జీలను పరిగణనలోకి తీసుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. తీసుకున్న అర్జీని పరిశీలించి ఫోన్ చేస్తాం అని చెబుతున్నారని, కానీ ఆ ఫోన్ రాని పక్షంలో మళ్లీ మళ్లీ రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా స్వీకరించిన అర్జీకి పలు కారణాలు సృష్టిస్తూ రిజెక్ట్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. తీవ్ర జాప్యం చేయడంతో సమస్యను బట్టి వెలకడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సదస్సుల్లో ఎక్కువ సంఖ్యలో సర్వే సమస్యలే వచ్చాయి. వాటి పరిష్కారంలో నిర్లక్ష్యం ఆవహించింది. సదస్సులు ముగిసి నెలలు దాటినా ఇప్పటికీ పలువురు రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతుండటం గమనార్హం. ప్రస్తుతం వస్తున్న అర్జీలలో రెవెన్యూ సమస్యలే ఎక్కువగా ఉంటున్నాయి. ఉన్నతాధికారులు ప్రతివారం పూర్తిస్థాయిలో అర్జీలను నమోదు చేసి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అర్జీదారులు కోరుతున్నారు.

సేవా సంస్థలను ప్రోత్సహించాలి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు

గుంటూరు రూరల్: సమాజంలో అనాథలను, అభాగ్యులను, మానసిక వికలాంగులను ఆదుకుంటున్న కార్మెల్ సేవా సదన్ లాంటి సంస్థలను ప్రోత్సహించడం మనందరి కర్తవ్యమని నరసరావుపేట లోక్‌సభ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఆదివారం గోరంట్ల గ్రామంలోని కార్మెల్ సేవా సదన్ ప్రాంగణంలో జరిగిన ప్రహరీ ప్రారంభోత్సవం, సేవాసంస్థల ఆత్మీయ సమ్మేళనాన్ని ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకస్(గోతాల స్వామి) గత మూడు దశాబ్దాలుగా పొన్నూరు పట్టణంలో 300 మంది మానసిక వికలాంగులైన మహిళలకు, గుంటూరులోని గోరంట్ల వద్ద 75 మంది మానసిక వికలాంగులైన పురుషులకు ఉచితంగా భోజన, వసతిలతో పాటు సేవలను అందించడం వారి నిస్వార్థ సేవా తత్పరతకు నిదర్శనమన్నారు. డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ కేరళలో జన్మించిన జాక్ క్లమాకస్ కార్మెల్ సేవా సదన్‌ను స్థాపించి దాదాపు 400 మంది మానసిక వికలాంగులకు అండగా నిలిచారన్నారు.

● గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ శర్వాణి రెడీమిక్స్ అధినేత పెద్దిరెడ్డి గోపాల్‌రెడ్డి కార్మెల్ సేవా సదన్ ప్రహరీ నిర్మాణానికి దాదాపు రూ.10 లక్షలు అందించడం హర్షణీయమన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరంలో దాదాపు 25 సేవా సంస్థలు బహుముఖ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని, ఇవన్నీ కలిసి ఐక్యంగా కృషి చేస్తే మరిన్ని సత్ఫలితాలు వస్తాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ నగరంలో డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి చేస్తున్న సేవలు అద్వితీయమన్నారు. శర్వాణి ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కార్మెల్ సేవా సదన్ ప్రహరీ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించడం గర్వకారణంగా ఉందన్నారు.

● కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకస్(గోతాల స్వామి) ప్రసంగిస్తూ కార్మెల్ సేవా సదన్‌కు ప్రహరీ నిర్మించిన దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ గత మూడేళ్లగా గుంటూరు నగరంలో సంస్థ చేపడుతున్న బహుముఖ కార్యక్రమాలను వివరించారు. అమ్మా నాన్న చారిటబుల్ ట్రస్ట్, కోవిడ్ ఫైటర్స్, రుద్రా చారిటబుల్ ట్రస్ట్, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, నేస్తం ఫౌండేషన్, రేట్ పేయర్స్ అసోసియేషన్, అభినందన ఫౌండేషన్, చైల్డ్ హార్ట్ ఫౌండేషన్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్, హ్యాపీ కేర్ ఓల్డ్ ఏజ్ హోమ్, బహుజన మహాసభ కేంద్రం, మాతృదేవోభవ సంస్థల ప్రతినిధులను ఘనంగా సత్కరించి, వారి సేవలను కొనియాడారు.

యాదవజాతి ఆత్మగౌరవం దెబ్బతీసే కుట్ర

వైఎస్సార్ సీపీ బీసీ విభాగం ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు దారా అశోక్‌కుమార్



గుంటూరు రూరల్: యాదవ జాతి ఆత్మగౌరవాన్ని, మనోభావాలను దెబ్బతీసేందుకే పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో ఎన్టీఆర్‌ను పోలిన శ్రీకృష్ణుడి విగ్రహావిష్కరణ చేపట్టారని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు దారా అశోక్‌కుమార్ ఖండించారు. తక్కెళ్ళపాడు గ్రామంలో అగ్రవర్ణాలకు చెందిన కొందరు వ్యక్తులు మహానటుడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేపట్టి శ్రీకృష్ణుడని పోలిన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం దురదృష్టకరమన్నారు. యాదవజాతి మొత్తం శ్రీకృష్ణుడిని ఇలవేల్పుగా కొలుస్తోందని, అటువంటి శ్రీకృష్ణుడిని సినీ నటుల విగ్రహాలతో పోల్చే ఏర్పాటు చేయడం అగ్రవర్ణాలు యాదవ జాతిని అణగదొక్కేందుకు చేసిన కుట్రలో భాగంగానే తాము భావిస్తున్నామన్నారు. పార్టీలకు, ఇతర ఏ విషయానికి సంబంధం లేకుండా విగ్రహాన్ని తొలగించేందుకు యావత్తు యాదవజాతి సంఘాలతో కలిసి ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. అందుకు యాదవజాతి సహకరించాలని తెలిపారు. కేవలం ఒక వర్గానికి చెందిన వ్యక్తులు ఎన్టీఆర్‌ను పోలిన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, దీనిని ఇలాగే వదిలేస్తే దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థన మందిరాల్లో సైతం ఆ వర్గానికి చెందిన వ్యక్తుల విగ్రహాలే ఏర్పాటు చేస్తారా అని ప్రశ్నించారు. యాదవుల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించి మరొక ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని విగ్రహ కమిటీకి విజ్ఞప్తి చేశారు. లేదంటే ఉద్యమం రాష్ట్రస్థాయిలో జరుగుతుందని హెచ్చరించారు. బీజేపీకి, హైందవ సంఘాలకు ఇటువంటి సంఘటనలు కనిపించవా.. అని ప్రశ్నించారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ చాంబర్‌లో నిర్వహించే కార్యక్రమానికి 0863–2224202 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

బాబాయిపై దాడి



లక్ష్మీపురం: చెడు అలవాట్లు మానుకోమని మందలించిన బాబాయిపై కత్తితో దాడి చేసిన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు... గుంటూరు శారదాకాలనీ 7వ లైన్‌కు చెందిన షేక్ సిలార్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన సిలార్ సోదరుడి కుమారుడు హుస్సేన్ ఇటీవల చెడు వ్యసనాలకు బానిస అయ్యాడు. ఈ విషయం తెలిసిన బాబాయి సిలార్, హుస్సేన్‌ను చెడు అలవాట్లు మానుకోవాలని మందలించాడు. దీంతో హుస్సేన్, బాబాయి సిలార్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. రక్తపు మడుగులో ఉన్న సిలార్‌ను స్థానికుల జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స అనంతరం సిలార్ అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుకొస్తున్నాయి..!



కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

- ● కేసీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
- ● 45 ఏళ్ల తరువాత కలుసుకున్న మిత్రులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెం గ్రామంలోని కొండవీటి కమిటీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. 1976 నుంచి 1980 విద్యా సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హైస్కూల్ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. పదవ తరగతి పూర్తి అయిన 45 సంవత్సరాల తరువాత వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వృత్తి, వ్యాపారాల్లో స్థిరపడిన సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు కలుసుకొని పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. ఆప్యాయతలను పంచుకున్నారు. ఇక్కడ విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకున్న వారిలో న్యాయవాదులు, అధికారులు, వివిధ సంస్థల అధినేతలుగా, వివిధ వృత్తులలో జీవితాల్లో స్థిరపడటంతో చిన్ననాటి అనుభవాలను గుర్తు చేసుకొని ఆనందం వ్యక్తం చేశారు. కొండవీటి కమిటీ పాలకవర్గ కరస్పాండెంట్ గాదె వెంకటసుబ్బారెడ్డి, అధ్యక్షుడు గాదె వెంకటరెడ్డిలు పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆనాడు చదువులు చెప్పిన గురువులు ఆర్వీ సుబ్బారెడ్డి, దుష్యంత్ రెడ్డి, వెంకటరెడ్డి, సాంబశివరావులకు పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు. 1925లో ఏర్పడిన కేసీ హైస్కూల్ నూరేళ్ల సంబరాలు జరుపుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అలరించిన పౌరాణిక నాటికల్లో సన్నివేశాలు



సత్యహరిశ్చంద్రలో అడవి సన్నివేశం

నగరంపాలెం: స్థానిక నల్లచెరువు 15 వీధిలోని షిరిడి సాయిబాబా ఆలయ కళా ప్రాంగణం వేదికపై ఆదివారం సాయంత్రం పౌరాణిక నాటికల్లోని సన్నివేశాలను ప్రదర్శించారు. ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి(విజయవాడ), శ్రీగౌరీ శంకర కళా నాట్యమండలి సాంస్కృతిక సమాజ సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించారు. తొలుత సత్య హరిశ్చంద్ర అడవి సన్నివేశం, శ్రీకృష్ణ తులాభారం నాటకం ప్రదర్శించారు. చక్కటి పద్యాలతో కళాభిమానులను అలరించారు. ప్రముఖ రంగస్థల కళాకారులు ఏపీ ఆదినారాయణరావును వెండి కిరీటంతో సత్కరించారు. కార్యక్రమంలో గౌరీ శంకర కళా నాట్య మండలి వ్యవస్థాపకులు సనిశెట్టి సాంబశివరావు, పౌరాణిక కళాకారుల సంఘం అధ్యక్షులు నల్లక శ్రీనివాసరావు, చెన్నుపాటి కృష్ణారావు, ఆలయ పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి నాగేశ్వరరావు, మిర్చి శ్రీనివాసరావు, కళాకారులు పాల్గొన్నారు.

15న లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన

సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ

లక్ష్మీపురం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 15న విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే సామూహిక రాయబార కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ కోరారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నార్నే నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం గడిచినప్పటికీ భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం ఒక్కటి అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డు పునరుద్ధరించి సంక్షేమ పథకాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సంవత్సరం గడిచిందని సుపరిపాలన పేరుతో యాత్రలు చేస్తున్న అధికార పార్టీ నాయకులు కార్మికులకు ఏం చేశారని ప్రశ్నించారు. సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ క్లెయిమ్ లు పరిష్కరించాలని కోరారు. రాజధాని నిర్మాణంలో స్థానికులకు ఉపాధి కల్పించాలని, వలస కార్మికులకు వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలని కోరారు. రాష్ట్రాల నుంచి వచ్చే కార్మికుల సమాచారాన్ని లేబర్ డిపార్ట్‌మెంట్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిషేధిత కలుపు మందుల ప్యాకెట్లు సీజ్



నగరంపాలెం: గుంటూరు నగరంలోని పురుగు మందుల దుకాణాలు, తయారీ కేంద్రాలు, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. నగరంపాలెంలోని క్రాంతి ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో తనిఖీలు చేయగా, గడువు ముగిసిన, నిషేధించిన వంద గ్రాముల చొప్పున 55 ప్యాకెట్ల అమ్మోనియం సాల్ట్ ఆఫ్ గ్లైఫోసేట్ 71శాతం ఎస్‌జీ గుర్తించారు. నాయుడుపేట శ్రీనివాస సీడ్స్ నుంచి గుంటూరులోని శబరి క్రాప్ కేర్ సైన్స్ ప్రై లిమిటెడ్‌కు సరఫరా చేసినట్లు నిర్ధారించారు. ఈనెల 4న సరఫరా అయినట్లు తనిఖీల్లో గుర్తించారు. సుమారు రూ.11 వేలు ఖరీదు చేసే 55 ప్యాకెట్ల కలుపు మందులను సీజ్ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, సహాయ సంచాలకులు ఎస్.మోహన్‌రావు, గుంటూరు పట్టణ పురుగు మందుల ఇన్‌స్పెక్టర్ ఆర్.సుజాత పాల్గొన్నారు.

కంకరగుంట ఆర్‌యూబీ వద్ద మరమ్మతులు చేపట్టాలి

నెహ్రూనగర్: కంకర గుంట ఆర్‌యూబీ కల్వర్ట్ ఇనుప జాలీ మరమ్మతులు వెంటనే చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కంకర గుంట దగ్గర వాహనాల రాక పోకలను పరిశీలించారు. ఇనుప జాలీ పక్కకి జరిగి ఉండడం గమనించారు. అదే విధంగా లైటింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని, నీరు నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.

